

## నల్గొండ గులాబీలకు అభినందనలు

**మాజీ మంత్రి కేటీఆర్**

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): నల్గొండ రైతు మహాధర్నా అద్భుత విజయం సాధించడంతో, అందులో భాగస్వామ్యమైన గులాబీ సైనికులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందించారు. రైతాంగానికి బీఆర్ఎస్ ఎల్లవేళలా అండగా ఉంటుందని చెప్పేందుకు నల్గొండలో మంగళవారం చేపట్టిన రైతు ధర్నా నిదర్శనమని తెలిపారు. ధర్నాను విజయవంతం చేసిన రైతాంగానికి, పార్టీ శ్రేణులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## హే మహాత్మా.. కాంగ్రెస్ కండ్లు తెరిపించు!

- 420 హామీలపై బీఆర్ఎస్ వినూత్న నిరసన
- నేడు గాంధీజీ విగ్రహాలకు వినతిపత్రాల అందజేత

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ కండ్లు తెరిపించేందుకు బీఆర్ఎస్ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. గురువారం జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించనున్నది. అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 420 రోజులు పూర్తి చేసుకుంటున్నా.. ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలు పూర్తి చేయని నేపథ్యంలో బీఆర్ఎస్ వినతిపత్రాలు అందించనున్నది. గాంధీచూపిన మార్గంలో నిరసన చేపట్టనున్నట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## బీసీలపై రాజకీయ కక్ష మానుకోవాలి


- బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్



హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): బీసీ నేతలు, యువకులపై.. కాంగ్రెస్ ప్రభుత్వం, అధికార పార్టీ నేతలు రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతున్నారని బీసీ జనసభ అధ్యక్షుడు డీ రాజారాం యాదవ్ ఆరోపించారు. కక్షపూరిత చర్యలను ప్రభుత్వం వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బీసీలను రాజకీయంగా అణదొక్కాలని కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు. హస్తం పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అడిగితే అక్రమ కేసులు పెడుతున్నారని ధ్వజమెత్తారు. కోరుట్ల నియోజకవర్గం మల్లాపూర్ మండలం గుండాల గ్రామానికి చెందిన ఐదుగురు బీసీ యువకులపై స్థానిక కాంగ్రెస్ నేత జలపతిరెడ్డి కక్షగట్టి అక్రమంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టించారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ నేతల తీరు ఇలాగే ఉన్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని, లేకపోతే బీసీ సంఘాల నుంచి తీవ్ర ప్రతిఘటన తప్పదని, 'చలో మల్లాపూర్' కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

# హామీల తిప్పలు.. దావోస్ గప్పాలు

- పెట్టుబడులపై రేవంత్ బడాయి
- గతంలో 10 వేల కోట్లూ రాలే
- హామీలపై ప్రజలు నిలదీస్తున్నారు
- సచివాలయం ఉండగా సీసీఎస్‌లో సమీక్షలెందుకు?
- పోలీస్, మాఫియా పాలనకా?
- అటెన్షన్ డెఫిషియన్సీ సిండ్రోమ్‌తో బాధపడ్తున్న సీఎం
- కేసీఆర్‌ది నాడు సుస్థిర పాలన.. నేడు అస్థిరపాలన
- శాసనమండలి ప్రతిపక్ష నేత ఎస్ మధుసూదనాచారి



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మధుసూదనాచారి, చిత్రంలో మెతుకు ఆనంద్, జైపాల్ యాదవ్, చిరుమర్తి లింగయ్య

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ హామీలు అమలు కాకుండా పేరుకుపోగా, దావోస్ పెట్టుబడులపై సీఎం రేవంత్‌రెడ్డి గొప్పలు చెప్పుకుంటున్నారని శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి విమర్శించారు. ప్రజలు నిలదీస్తుంటే సమాధానం చెప్పుకోలేక, దృష్టిని మళ్లించడానికే రేవంత్ పెట్టుబడులు తెచ్చామంటూ చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో బుధవారం మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, చిరుమర్తి లింగయ్య, మెతుకు ఆనంద్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. గతంలో కుదిరిన రూ.40 వేల కోట్ల పెట్టుబడుల ఒప్పందాల్లో రూ.10 వేల కోట్లు కూడా రాష్ట్రానికి రాలేదని గుర్తుచేశారు. దేశంలో తానే గొప్ప పనులు చేస్తున్న సీఎంగా రేవంత్ చెప్పుకోవడం హాస్యాస్పదమని ఎద్దేవాచేశారు. దావోస్ ఎంవోయూలు టూర్ నెట్‌వర్కింగ్‌కు మాత్రమే ఉపయోగపడతాయని ఏపీ సీఎం చంద్రబాబే చెప్పారని గుర్తుచేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా ఎంవోయూలను ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్‌గానే చూస్తామని, ఓపెన్ టెండర్లను ఆహ్వానిస్తామని చెప్పారని పేర్కొన్నారు. మేఘా వంటి చాలా సంస్థలు హైదరాబాద్‌కు చెందినవేనని, హైప్ సృష్టించడానికి, లెక్కలు ఘనంగా చెప్పుకోవడానికి దావోస్‌లో ఎంవోయూలు చేసుకున్నారని మండిపడ్డారు. 13 నెలల పాలనలో రేవంత్‌రెడ్డి ఏం సాధించారని నిలదీశారు. కేసీఆర్ హయాంలోనే రాష్ట్రంలో సుస్థిరపాలన కొనసాగిందని, ఐటీ అభివృద్ధికి కేటీఆర్ ఇతోధికంగా పనిచేశారని గుర్తుచేశారు. అలాంటివారిపై అసహనంతోనే రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

### ఏడీసీతో బాధపడుతున్న రేవంత్

సీఎం రేవంత్‌రెడ్డి అటెన్షన్ డెఫిషియన్సీ సిండ్రోమ్ (ఏడీసీ)తో బాధపడుతున్నారని మధుసూదనాచారి తెలిపారు. సింగపూర్‌ను రాష్ట్రం అని, అమెజాన్ వెబ్‌సిరీస్ అని, టీబీ వ్యాధిని లెప్రసీగా చెప్తున్నారని తెలిపారు. అవగాహన లేని సీఎం దేశంలో మరొకరు లేరని పేర్కొన్నారు. అనుభవరాహిత్యంలో రేవంత్‌కు ఆయనే సాటి అని విమర్శించారు. రేవంత్ హామీలపై పలాయనవాద వైఖరి అవలంబిస్తున్నారని, కేసీఆర్ సుస్థిరపాలన అందిస్తే రేవంత్ రాష్ట్రంలో అస్థిరపాలన తెచ్చారని మండిపడ్డారు. కేసీఆర్ కట్టిన అంత పెద్ద సచివాలయం ఉండగా, పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (సీసీఎస్) నుంచి సీఎం రేవంత్ ఎందుకు సమీక్షలు చేస్తున్నారని ప్రశ్నించారు. పోలీస్ పాలన, మాఫియా పాలన తెచ్చేందుకే తరచూ సీసీఎస్‌కు వెళ్తున్నారా? అని నిలదీశారు. తప్పుడు కేసులు బనాయిస్తే సహించబోమని హెచ్చరించారు.

### అనంతగిరి అడవులను మేఘాకు ఇచ్చే కుట్ర: ఆనంద్

అనంతగిరి అడవులను మేఘా సంస్థకు రూ.1,000 కోట్లకు ధారాదత్తం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ విమర్శించారు. దీనిపై త్వరలోనే వికారాబాద్ నుంచే ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. తెలంగాణ పోలీస్ అకాడమీ నుంచి వికారాబాద్ రోడ్డు అధ్వానంగా ఉన్నదని, వీటి మరమ్మతులకు నిధులు లేవని, మూసీ అభివృద్ధికి లక్షన్నర కోట్లు ఎలా వస్తాయని ప్రశ్నించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని, రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలు పెడితే బీసీలు కాంగ్రెస్ నాయకులను గ్రామాలకు రానివ్వొద్దని పిలుపునిచ్చారు.

### కుంభమేళా మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

యూపీ కుంభమేళా తొక్కిసలాటలో మరణించిన భక్తుల కుటుంబాలను కేంద్రం, యూపీ ప్రభుత్వాలు ఆదుకోవాలని మధుసూదనాచారి డిమాండ్ చేశారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని కోరారు. తొక్కిసలాట ఘటన తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ తరఫున సానుభూతిని వ్యక్తంచేశారు.

# 31న 'జాగృతి' రౌండ్‌టేబుల్ మీటింగ్

- కాంగ్రెస్ వైఫల్యాలపై ప్రముఖులతో చర్చ
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలకోపన్యాసం
- చర్చలో ఇరిగేషన్ నిపుణులు, విశ్రాంత ఇంజనీర్లు



హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): ఈ నెల 31న హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సాగునీటి ప్రాజెక్టులపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు తెలంగాణ జాగృతి ఓ ప్రకటనలో తెలిపింది. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వ అసత్య ప్రచారాలను పటాపంచలు చేయడానికి ప్రముఖులతో చర్చించనున్నట్టు తెలిపింది. సమావేశంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలకోపన్యాసం చేయనున్నారు. మేధావులు, తెలంగాణ ఉద్యమకారులు, సాగునీటిరంగ నిపుణులు, విశ్రాంత ఇంజినీర్లు హాజరుకానున్నట్టు పేర్కొన్నది. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ప్రాజెక్టులను పూర్తిగా నిర్లక్ష్యం చేయడమే కాకుండా, కేసీఆర్ నిర్మించిన కీలక ప్రాజెక్టులపై దుష్ప్రచారం చేస్తున్నదని జాగృతి పేర్కొన్నది. కాళేశ్వరంపై ప్రభుత్వం చేస్తున్న అసత్య ప్రచారాన్ని సమావేశం ద్వారా తిప్పికొడతామని స్పష్టంచేసింది. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ప్రభుత్వం ప్రణాళికను ప్రజల ముందు పెట్టాలని డిమాండ్ చేసింది. ఈ అంశాలపై రౌండ్‌టేబుల్ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించి, తీర్మానాలను ఆమోదిస్తామని తెలిపింది. కేసీఆర్ ప్రారంభించారనే అక్కసుతోనే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని జాగృతి పేర్కొన్నది.

# గ్యారెంటీలే కాంగ్రెస్‌కు ఉరితాళ్లు!

- వందరోజుల్లో 420 హామీల అమలుకు హామీ
- 420 రోజులైనా అమలు చేయలేని వైనం
- కాంగ్రెస్ పాలనలో భారీగా పెరిగిన క్రైమ్‌రేట్
- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): ఇచ్చిన హామీలే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉరితాళ్లుగా మారుతాయని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి హెచ్చరించారు. 100 రోజుల్లో అమలు చేస్తామన్న 420 హామీలను 420 రోజులైనా అమలు చేయలేకపోయిందని విమర్శించారు. ఓ న్యూస్ చానల్‌కు బుధవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. రాష్ట్ర ప్రజలంతా ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని, కాంగ్రెస్ వచ్చాక రాష్ట్రంలో క్రైం రేట్ విపరీతంగా పెరిగిందని ఆందోళన వ్యక్తంచేశారు. స్వల్పకాలంలో కేటీఆర్ ఐటీ కంపెనీలకు అన్ని సౌకర్యాలను కల్పించారని గుర్తుచేశారు. టీఎస్ బీపాస్, టీఎస్ ఐపాస్ వంటి పాలసీలతో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయని చెప్పారు. ప్రైవేటు రంగంలో 20 లక్షల ఉద్యోగాలను నాడు కేటీఆర్ కల్పించారని గుర్తుచేశారు. భూమి కనిపిస్తే ఎలా పచ్చగా చేయాలా అని కేసీఆర్ ఆలోచిస్తారని, భూమి కనిపిస్తే ఎలా రాళ్లుపాతి అమ్మాలా? అని రేవంత్‌రెడ్డి చూస్తున్నారని విమర్శించారు. రియల్ ఎస్టేట్ చేసే వాళ్లు మాత్రమే కాంగ్రెస్‌లో చేరారని విమర్శించారు. రేవంత్ పాలనలో ధాన్యం సేకరణే జరగలేదని, ఒకవేళ సేకరిస్తే ఆ ధాన్యం ఎంతో చెప్పాలని డిమాండ్ చేశారు. మూసీ పునరుజ్జీవం పేరిట ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కుట్రకు తెరలేపారని విమర్శించారు.

# చైత్యభూమిని దర్శించిన శ్రీనివాస్‌గౌడ్



అంబేద్కర్ అంతిమ సంస్కారాలు జరిగిన చైత్యభూమిని దర్శించుకున్న శ్రీనివాస్‌గౌడ్

- అంబేద్కర్‌కు ఘన నివాళి

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): ముంబైలో అంబేద్కర్ అంతిమ సంస్కారాలు జరిగిన ప్రదేశం చైత్యభూమిని దక్షిణ భారత ఓబీసీ అసోసియేషన్ ముఖ్య సలహాదారుడు, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ బుధవారం సందర్శించారు. పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళి అర్పించారు. ముంబై వలసజీవులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయనకు వివరించారు. ఈ సందర్భగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కేంద్రం ఓబీసీ కులగణన జరిపించాలని, చట్టసభల్లో దామాషా ప్రకారం ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు రంగంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ముంబై ప్రధాన కార్యదర్శి శివరాజ్ బొల్లె, పలు సంఘాల నేతలు పాల్గొన్నారు.

# రేవంత్‌వి ఊసరవెల్లి మాటలు

- ప్రభుత్వ అస్పష్ట విధానాలతో అన్నదాతల అవస్థలు
- సగం మంది రైతులకే రుణమాఫీ
- రైతుభరోసా 12వేలకే పరిమితం
- ఆత్మస్థైర్యం కోల్పోయిన రైతులు
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత, కొప్పుల ఈశ్వర్ మండిపాటు



హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): ఊసరవెల్లిని మించి సీఎం రేవంత్‌రెడ్డి మాటలు మారుస్తున్నారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఒక ప్రకటనలో విమర్శించారు. వానకాలం రైతుభరోసా ఎగ్గొట్టి.. సంక్రాంతికి ఇస్తామని మరోసారి మాట తప్పారని ధ్వజమెత్తారు. జనవరి 26న ఇస్తామని చెప్పి మార్చి 31 వరకు అని మాట మార్చడమే మరో నిదర్శనం అని పేర్కొన్నారు. ఇప్పుడే తీసుకుంటే రైతుబంధు రూ.10 వేలు, 2023 డిసెంబర్ 9 తర్వాత తీసుకుంటే రూ.15 వేల రైతు భరోసా అని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి రైతులను నమ్మించి గొంతు కోశారని మండిపడ్డారు. ఇలా పలు అంశాల్లో మాట తప్పారని తెలిపారు. ముఖ్యంగా అన్నదాతలను నమ్మించి రేవంత్‌రెడ్డి సర్కార్ మోసం చేసిందని, రైతులు ఆత్మస్థైర్యాన్ని కోల్పోయారని తెలిపారు. రేవంత్ మాటలను నమ్మి రైతులు ఆగమయ్యారని, కాంగ్రెస్ పాలన రైతులకు కన్నీళ్లే మిగిల్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. బ్యాంకులో పంట రుణం తీసుకున్నందుకు వడ్డీ వసూలు కింద కల్యాణలక్ష్మి సాయాన్ని జమ చేసుకుంటున్నారని మండిపడ్డారు. '2023 డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తాం. పూచీ నాది. రుణాలు తెచ్చుకోని వారు పరుగెత్తి తెచ్చుకోండి' అని ప్రగల్భాలు పలికిన రేవంత్‌రెడ్డి.. 2024 ఆగస్టు 15 వరకు రుణమాఫీ గడువు పొడిగించారని గుర్తుచేశారు. దసరా వరకు రుణమాఫీ అని చెప్పినా నేటికీ 20 లక్షల పైచిలుకు రైతులకు రుణమాఫీ కాలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఓ సీజన్ మొత్తానికి పెట్టుబడి సాయం బంద్ చేసి రైతులను మోసం చేసిందని మండిపడ్డారు. స్థానిక ఎన్నికల కోసమే పథకాల పేరిట మాయమాటలు చెప్తున్నారని విమర్శించారు.



## హాస్టల్‌లో ఊడిపడ్డ పైపు

**అచ్చంపేటలో విద్యార్థినికి గాయాలు**

అచ్చంపేట రూరల్, జనవరి 29 : హాస్టల్‌లో విద్యార్థిని తలపై ఇనుప పైపు పడడంతో గాయాలైన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటుచేసుకున్నది. అచ్చంపేట ఎస్సీ బాలికల హాస్టల్‌లో ఉంటూ నందిని ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నది. బుధవారం హాస్టల్ ఆవరణలో ఉండగా భవనంపై నుంచి ఇనుప పైపు ఊడిపడింది. ఆమె తలకు తీవ్ర గాయం కాగా వార్డెన్ స్థానిక దవాఖానకు తరలించారు. పరిసరాల్లో కోతుల బెడద అధికంగా ఉన్నదని, భవనంపై నుంచి వెళ్లే క్రమంలో పైపును కదలించడంతో ఊడిపోయి ఉండొచ్చని విద్యార్థులు అభిప్రాయం వ్యక్తంచేశారు.

# మైనారిటీలకు కాంగ్రెస్ ధోకా

- ఒక్క హామీ అమలు చేయలేదు
- ఇమామ్, మౌజమ్, ఖాదీమ్‌లకు గౌరవ వేతనాలు ఎప్పుడిస్తరు?
- కాంగ్రెస్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జ బెదిరించినా చర్యల్లేవు
- బీఆర్ఎస్ నేత ఇంతియాజ్



హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 420 రోజులైనా మైనారిటీ డిక్లరేషన్‌లో ప్రకటించిన ఒక్క హామీని కూడా అమలు చేయకుండా ధోకా చేసిందని బీఆర్ఎస్ మైనారిటీ నేత ఇంతియాజ్ అహ్మద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినప్పటికీ కాంగ్రెస్‌లో పార్టీలోని ముస్లిం నాయకులెవరూ మైనారిటీల సమస్యలపై మాట్లాడటం లేదని మండిపడ్డారు. రేవంత్ పాలనలో రాజ్యాంగం ప్రకారం మైనారిటీలకు రావాల్సిన ప్రయోజనాలు రావడం లేదని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో బుధవారం పార్టీ నేతలు అబ్దుల్ కలీం, బైకాని శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి ఇంతియాజ్ అహ్మద్ మీడియాతో మాట్లాడారు. మైనారిటీ సబ్‌ప్లాన్ ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. ఇమామ్, మౌజమ్‌లకు ఐదు నెలలుగా గౌరవ వేతనం అందడం లేదని ధ్వజమెత్తారు. ఇమామ్, మౌజమ్‌లతోపాటు దర్గా ఖాదీమ్‌లకు చర్చ్ పాస్టర్ల తరహాలో ఇస్తామన్న నెలకు రూ.10-12 వేల గౌరవ వేతనం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మైనారిటీలకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నా సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జ మైనారిటీల అంతు చూస్తామని బెదిరించినా చర్యలు తీసుకోవడం లేదని, ఇదేనా కాంగ్రెస్ విధానం అని నిలదీశారు. రేవంత్ మంత్రివర్గంలో ఒక్క మైనారిటీకి కూడా స్థానం కల్పించలేదని, సెక్యులర్ విలువలను కాంగ్రెస్ మంటగలుపుతున్నదని మండిపడ్డారు. మైనారిటీ గురుకులాల పరిస్థితులు దారుణంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో మైనారిటీలకు కేటాయించిన నిధులు ఎందుకు ఖర్చు చేయడం లేదని ప్రశ్నించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మైనారిటీలు కాంగ్రెస్‌కు గట్టిగా బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు.

## జీఆర్ఎంబీ చైర్మన్‌గా ఏకే ప్రధాన్

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) చైర్మన్‌గా ఏకే ప్రధాన్ నియమితులయ్యారు. కేంద్ర జలశక్తి శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం జీఆర్ఎంబీ చైర్మన్‌గా ముకేశ్ కుమార్ సిన్హా ఉండగా, ఇటీవలే ఆయన కేంద్ర జల సంఘం చైర్మన్‌గా నియమితులై బదిలీపై వెళ్లారు.

### వనపర్తి సీఈగా ఏఎస్ఎన్ రెడ్డి..



వనపర్తి ఇరిగేషన్ టెరిటోరియల్ చీఫ్ ఇంజినీర్‌గా ఏ సత్యనారాయణరెడ్డి నియమితులయ్యారు. అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ప్రభు త్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వనపర్తి సీఈగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న విజయభాస్కర్‌రెడ్డిని రిలీవ్ చేయగా ఆయన స్థానంలో నాగర్‌కర్నూల్ సర్కిల్-2 ఎస్ఈ సత్యనారాయణరెడ్డికి సీఈగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను అప్పగించింది. కాగా, ఏఎస్ఎన్ రెడ్డి ప్రస్తుతం హెచ్ఈఏ సలహాదారుగా కొనసాగుతున్నారు.

# పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్

*రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, వసతి గృహాల్లో ఫుడ్ పాయిజన్ కావడంతో బుధవారం పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు నాయకులు ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రభుత్వ నియంత్రణ కొరవడడంతోనే ఈ ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు.*

- ధన్వాడలో 22 మందికి అస్వస్థత
- ఎల్లారెడ్డిలో భోజనం వికటించి విద్యార్థులకు వాంతులు
- సూర్యాపేటలో విద్యార్థినులకు అనారోగ్యం

ధన్వాడ, జనవరి 29 : నారాయణపేట జిల్లా ధన్వాడ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనం తర్వాత ముగ్గురు విద్యార్థులు వాంతులు చేసుకున్నారు. మరో 19 మంది విద్యార్థులు కడుపునొప్పి అనడంతో సిబ్బంది హెచ్‌ఎం నర్సింహాచారికి విషయం తెలిపారు. ప్రభుత్వ దవాఖాన డాక్టర్ అనూష సిబ్బందితో పాఠశాలకు చేరుకొని విద్యార్థులను పరీక్షించారు. కలుషిత ఆహారం, నీటి కారణంగా అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. విద్యార్థులకు మినరల్ వాటర్‌ను అందిస్తున్నామని హెచ్‌ఎం తెలిపారు.

### ఎల్లారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 29: ఎల్లారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి 16మంది విద్యార్థులు అస్వస్థతకు గురికాగా, దవాఖానకు తరలించి చికిత్స అందించారు. కోలుకున్న వారిని డిశ్చార్జ్ చేశారు. నలుగురు విద్యార్థులు దవాఖానలో చికిత్స పొందుతున్నారు.

### సూర్యాపేట జిల్లా కేంద్రంలో..

సూర్యాపేట టౌన్, జనవరి 29 : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల సంక్షేమ వసతి గృహంలో 170 మంది విద్యార్థినులు ఉంటూ సమీప పాఠశాలల్లో చదువుకుంటున్నారు. బుధవారం మధ్యాహ్న భోజనం చేసిన అనంతరం తొమ్మిదో తరగతి విద్యార్థినులు ఆర్ దుర్గ, ఎస్ మహేశ్వరి, ఎనిమిదో తరగతి ఆర్ కనిష్క, బీ అక్షిత, ఆరో తరగతి బీ పూజిత వాంతులు చేసుకున్నారు. వసతి గృహం సిబ్బందికి పట్టణంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. వసతి గృహం వద్దకు వెళ్లిన మీడియా ప్రతినిధులకు విద్యార్థినులు ఏ దవాఖానలో చికిత్స పొందుతున్నది చెప్పకుండా అధికారులు దాచారు. తాము చెప్పిన వివరాలే మీడియాకు చెప్పాలి అన్నట్టు విద్యార్థినులను సన్నద్ధం చేసినట్టు స్పష్టంగా కనిపించింది. సూర్యాపేట ఆర్డీవో వేణుమాధవ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, ట్రైబల్ వెల్ఫేర్ జిల్లా అధికారి శంకర్ విద్యార్థినులను పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు.



ధన్వాడ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

## కమ్యూనిస్టుల అణిచివేతకు బీజేపీ కుట్ర

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



హనుమకొండ, జనవరి 29: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కమ్యూనిస్టులను అంతం చేయాలనే దురాలోచన చేస్తుందని, ప్రజల పక్షాన నిత్యం పోరాటాలు నిర్వహించే కమ్యూనిస్టులకు అంతం లేదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. సీపీఐ వందేళ్ల వార్షికోత్సవాల సందర్భంగా బుధవారం హనుమకొండలో భారీ ర్యాలీ, సభ నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన జరిగిన సభకు చాడ వెంకట్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చాడ మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం నక్సలైట్ల పేరుతో ఎన్‌కౌంటర్ చేస్తూ కమ్యూనిస్టులను అంతం చేయాలని చూస్తున్నదని ఆరోపించారు.

## కార్పొరేట్లకు దోచిపెడుతున్న రేవంత్ సర్కారు

**ప్రభుత్వంపై త్వరలో ఉద్యమ కార్యాచరణ: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ వెల్లడి**



హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టడం విధానంగా రేవంత్‌రెడ్డి సర్కార్ పాలన సాగిస్తున్నదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. దళితులు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమం గురించి పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై త్వరలోనే ఉద్యమ ప్రణాళికలు చేపడుతామని జాన్‌వెస్లీ వెల్లడించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప.. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఏ పథకం కూడా అమలు కావడంలేదని విమర్శించారు. రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటన ప్రచార ఆర్భాటమేనని, ఫోర్త్ సిటీ పేరుతో రియల్టర్లు కోట్ల రూపాయల వ్యాపారం చేసుకుంటున్నారని చెప్పారు. బీజేపీ మతోన్మాద రాజకీయాలను అడ్డుకుంటామని స్పష్టంచేశారు. గద్దర్ గురించి అవగాహన లేకుండా బండి సంజయ్ వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. స్థానిక ఎన్నికల్లో పోటీ చేస్తామని చెప్పారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు

